www.hamsakalam.com

PRGI TGTEL/26/A3129

# హంస కలం వార్త

సంచలన తెలుగు దినపత్రిక

HAMSAKALAM VARTHA




మేడ్చల్ మల్కాజిగిరి | సెప్టెంబర్ 25 శుక్రవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 127 | పేజీలు : 8 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి

MEDCHAL ,MALKAJGIRI | FRIDAY SEPTEMBER 25 2026 | VOL:1 | ISSUE: 127 | PAGES:8 | Rs. 4:00 | EDITOR:VADLA. Madhusudan chary




# రేవంత్‌కు 'ఆర్యదాన్' గౌరవం..

## బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు ఎంపిక

- ఆర్యదాన్ మహమ్మద్ అవార్డు-2026కు తెలంగాణ సీఎం ఎంపిక
- రైతులు, బీసీలు, సామాన్యుల కోసం చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపు
- నిలంబూరులో రేపు పురస్కార ప్రదానం.. ప్రజాస్వామ్య విలువలపై నిబద్ధతకు ప్రశంస

రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు అవార్డు జ్యూరీ పేర్కొంది. ప్రజాస్వామిక విలువల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతను కూడా జ్యూరీ ప్రస్తావించినట్లు సమాచారం. ఆర్యదాన్ మహమ్మద్ పేరిట పురస్కారంకేరళకు చెందిన దివంగత సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ జ్ఞాపకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు

(మిగతా 2వ పేజీలో..)

## జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి: రాహుల్ గాంధీ డిమాండ్

- ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రెస్ మీట్
- మోదీ, అమిత్ షాలు 'ఓట్ల దొంగతనం' చేస్తున్నారని సంచలన ఆరోపణ
- సీఈసీ వెంటనే రాజీనామా చేసి, అప్రూవర్‌గా మారాలని డిమాండ్
- ఈసీలో అంతర్గత విభేదాల వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టీకరణ

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఒక "దేశద్రోహి" అని, ఆయన దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రమేయంతో దేశంలో 'ఓట్ల దొంగతనం'

(మిగతా 2వ పేజీలో..)



## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది: హరీశ్ రావు

- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ
- ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య

తాను క్షుద్ర పూజలు



(మిగతా 2వ పేజీలో..)

## స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు": కేటీఆర్

- దానం నాగేందర్ అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు
- ఇది రాహుల్, రేవంత్‌కు తగిలిన చెంపపెట్టు అన్న కేటీఆర్
- ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించాలని చూశారని విమర్శ
- రాజ్యాంగాన్ని కాపాడాలనే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడిందన్న హరీశ్ రావు

పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలతో



(మిగతా 2వ పేజీలో..)

## సీఎం విజయ్ లండన్ పర్యటన.. 'రుతుస్రావం' ప్రచారాన్ని ఖండించిన మంత్రి కీర్తన

- సీఎం లండన్ పర్యటనకు మంత్రి కీర్తన గైర్హాజరుపై వివాదం
- శస్త్రచికిత్స కారణంగానే పర్యటనకు దూరంగా ఉన్నట్లు వెల్లడి
- తన ఆరోగ్యం వ్యక్తిగత విషయమని, ఊహాగానాలు తగవని హితవు
- మహిళల ఆరోగ్యంపై చౌకబారు విమర్శలను ఖండించిన టీవీకే నేతలు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ లండన్ పర్యటనకు తాను గైర్హాజరు కావడంపై చెలరేగిన వివాదంపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. కీర్తన స్పష్టత ఇచ్చారు. ఒక చిన్న వైద్య ప్రక్రియ కారణంగానే తాను పర్యటనకు దూరంగా ఉన్నానని,

(మిగతా 2వ పేజీలో..)




## ఎన్నికల సంఘం యాప్‌పై మరోసారి వివాదం.. ఓటు హక్కులు హరించివేస్తున్నారని శశి థరూర్ ఫైర్

- ఎన్నికల సంఘం తీసుకొచ్చిన జుజ×చీవ్ సాఫ్ట్‌వేర్‌పై వివాదం
- పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల చేరిక అన్నీ ఎన్నికల ప్రధాన కమిషనర్ స్థాయిలోనే జరుగుతున్నాయని ఆరోపణలు
- పౌరుల ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడుతున్నాయన్న శశి థరూర్

ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్‌పై మళ్లీ తీవ్ర వివాదం చెలరేగింది. కొత్త ఓటర్ల చేరిక, పేర్ల తొలగింపు వంటి నిర్ణయాలు ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్



(మిగతా 2వ పేజీలో..)

హంస కలం వార్త

## సీఎం విజయ్ లండన్ పర్యటన.. 'రుతుస్రావం' ప్రచారాన్ని ఖండించిన మంత్రి కీర్తన

ఆరోగ్యం అనేది పూర్తిగా వ్యక్తిగత విషయమని ఆమె తేల్చిచెప్పారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు సీఎం విజయ్ లండన్‌లో పెట్టుబడుల ఆకర్షణ కోసం పర్యటించారు. ఈ పర్యటనకు మంత్రి కీర్తన వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది. కీర్తన నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉన్నారని మరో మంత్రి ఆధవ్ అర్జున చెప్పగా, డీఎంకే సానుభూతిపరురాలైన విమర్శకురాలు వైష్ణవి ఆ వ్యాఖ్యలను రుతుస్రావంతో ముడిపెడుతూ ప్రశ్నించారు. ఇది సహజ శారీరక ప్రక్రియ అయితే, దానిని ఒక కారణంగా ఎందుకు చెప్పాలని ఆమె అనడం లైంగిక వివక్ష ఆరోపణలకు దారితీసింది. ఈ వివాదంపై మంత్రి కీర్తన స్వయంగా వివరణ ఇచ్చారు. గతంలో అయిన గాయం కారణంగా అమర్చిన మెడికల్ ఇంప్లాంట్‌తో అసౌకర్యం కలగడంతో, దానిని సర్జరీ ద్వారా తొలగించాలని వైద్యులు సూచించారని తెలిపారు. అయితే, సెప్టెంబర్ 9న హెచ్‌డీ హ్యుందాయ్‌తో కీలక సమావేశం ఉండటంతో సర్జరీని వాయిదా వేసుకున్నానని, ఆ తర్వాత సర్జరీ జరిగిందని, వైద్యులు విశ్రాంతి సూచించారని వెల్లడించారు. ఈ సమయంలోనే లండన్ పర్యటన ఏర్పాట్లను దూరం నుంచే పర్యవేక్షించానని, తన గైర్హాజరుకు వేరే కారణం లేదని స్పష్టం చేశారు. ఆమెకు కాలర్‌బోన్ సర్జరీ జరిగిందని సహచర ఎమ్మెల్యే కనిమొళి సంతోష్ కూడా ధ్రువీకరించారు. "ఒక వ్యక్తి ఆరోగ్యం వ్యక్తిగత విషయం కాబట్టే నేను ఈ విషయాన్ని ముందుగా వెల్లడించలేదు. ప్రజా జీవితంలో ఉన్నవారి పనితీరును విశ్లేషించాలి కానీ, వారి ఆరోగ్యంపై ఊహాగానాలు చేయడం సరికాదు. మహిళలు తమ వ్యక్తిగత గోప్యత, గౌరవం మధ్య ఎంచుకోవాల్సిన పరిస్థితి రాకూడదు" అని కీర్తన తన ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా మంత్రి గైర్హాజరును అనారోగ్యం లేదా ఇతర కారణాలతో చూడకుండా, కేవలం జీవ సంబంధమైన అంశంతో ముడిపెట్టడాన్ని టీవీకే నేతలు "తిరోగమన ఆలోచనా ధోరణి"గా ఖండించారు. తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వివాదం చోటుచేసుకోవడం గమనార్హం.

## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది: హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు": కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా చేయించాలని రాహుల్‌కు సవాల్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ ఏరాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ఆయన ప్రశ్నించారు.

# జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి: రాహుల్ గాంధీ డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ ను ఆయన 'పరిరక్షకులే' కాపాడుతున్నారని మండిపడ్డారు. గురువారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ మౌనంగా ఉండదని హెచ్చరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు (Special Intensive Revision - SIR) సంబంధించి గత 10 నెలల్లో ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినా, వాటిని సీఈసీ పట్టించుకోలేదని వచ్చిన మీడియా కథనాలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఎన్నికల సంఘంలో ఈ అంతర్గత విభేదాలే తన ఆరోపణలకు బలమైన ఆధారమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "అబ్‌కీ బార్ 400 పార్" అని, దశాబ్దాల పాటు అధికారంలో ఉంటామని మోదీ, అమిత్ షాలు గతంలో ఎంతో ధీమాగా చెప్పారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యతిరేకత సర్వసాధారణమని, అలాంటిది బీజేపీకి మాత్రం ఎలా వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. "1971 యుద్ధంలో దేశానికి ఘన విజయం అందించిన ఇందిరా గాంధీ వంటి నేత కూడా ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా వ్యతిరేక పవనాలు ఉన్నా, అవి అకస్మాత్తుగా ఎలా మాయమయ్యాయి?" అని రాహుల్ నిలదీశారు. దీనికి కారణం 'ఓట్ల దొంగతనం' జరగడమేనని తమ పార్టీ ఒక నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. "ఓట్లను దొంగిలిస్తే రాజ్యాంగానికి పునాదులే ఉండవు. దొంగిలించబడిన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు చేసే చట్టాలు కూడా చట్టవిరుద్ధమే అవుతాయి. దీనిని 'చట్టాల దొంగతనం' అంటారు. దాని ఫలితంగా సంస్థాగత మార్పులు కూడా అక్రమమే అవుతాయి" అని రాహుల్ వివరించారు. ఈ ప్రక్రియకు బాధ్యులైన మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను దేశద్రోహులుగా అభివర్ణించారు. గతంలో జరిగిన లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దీనిపై మోదీ, షాలపై భవిష్యత్తులో తప్పకుండా విచారణ జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ, "మీరు చేసింది దేశద్రోహంతో సమానం. ఇది రాజ్యాంగంపై, దేశ చట్టాలపై జరిగిన దాడి. ఓటును కాపాడాల్సిన మీరే ఇలా చేశారు. ఇప్పటికైనా రాజీనామా చేసి, దేశ ప్రయోజనాల దృష్ట్యా అప్రూవర్‌గా మారండి" అని హితవు పలికారు. నిజాయతీగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఇద్దరు కమిషనర్లను ఆయన అభినందించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దీనిని నిరూపించడానికి తమ వద్ద తగినంత సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కుట్రకు బాధ్యులైన వారికి ఏదో ఒక రోజు తప్పకుండా శిక్ష పడుతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం గతంలోనే స్పందించింది. కమిషనర్ల మధ్య చర్చలు, అభిప్రాయ భేదాలు పరిపాలనలో సాధారణ ప్రక్రియ అని, తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది. అయినప్పటికీ, రాహుల్ చేసిన తాజా ఆరోపణలతో ఈ వివాదం మరింత ముదిరినట్టయింది.

## ఎన్నికల సంఘం యాప్‌పై మరోసారి వివాదం.. ఓటు హక్కులు హరించివేస్తున్నారని శశి థరూర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ స్థాయిలోనే జరుగుతున్నాయని, మిగతా ఇద్దరు కమిషనర్లకు సమాచారం కూడా అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆ సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గోవాలో జరిగిన ఘటనే ఈ వివాదానికి కారణం. ప్రత్యేక సమగ్ర సవరణ ( ) సమయంలో కొన్ని పేర్లపై సాఫ్ట్‌వేర్ అభ్యంతరాలు చూపింది. క్షేత్రస్థాయిలో సరిగ్గా పరిశీలించిన తర్వాత 97 మంది ఓటర్లు అర్హులేనని స్థానిక అధికారులు నిర్ధారించారు. కానీ వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైన రోల్‌బ్యాక్ సౌకర్యం యాప్‌లో లేదు. దీంతో గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఢిల్లీలోని ఎన్నికల సంఘానికి పదేపదే అభ్యర్థనలు పంపారు. అయినా అనుమతి రాకపోవడంతో ఆ పేర్లు జాబితాలోకి రాలేకపోయాయి. యాప్‌పై పూర్తి నియంత్రణ ఢిల్లీ వద్దే ఉందని సమాచారం. ఓటరు జాబితాలో పేరు లేకపోతే కేవలం ఓటు మాత్రమే కాదు... గోవా మెడిక్లెయిమ్ పథకం కింద డయాలసిస్, గుండె శస్త్రచికిత్స, అవయవ మార్పిడి, కీమోథెరపీ వంటి కీలక చికిత్సలకు కూడా అవకాశం దక్కదు. ఈ పథకం రాష్ట్ర ఓటర్లకే పరిమితం కావడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నారని థరూర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియా పోస్టులో ఆయన "ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. పౌరుల ప్రాథమిక హక్కులు, ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ఇలాంటి అమానుష వ్యవస్థను కొనసాగించకూడదు. ఎన్నికల సంఘం వెంటనే క్షమాపణ చెప్పి, ఈ సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయాలి. జరిగిన నష్టాన్ని సరిదిద్దాలి" అని స్పష్టం చేశారు.

# రేవంత్‌కు 'ఆర్యదాన్' గౌరవం.. బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ప్రజా సేవ, ప్రజాస్వామ్య విలువలు తదితర అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని అవార్డు గ్రహీతలను ఎంపిక చేస్తున్నట్లు నిర్వాహక వర్గాలు తెలిపాయి. ఈసారి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' విభాగంలో ఎంపిక చేశారు. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 25న నిలంబూరులో అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆర్యదాన్ మహమ్మద్ స్మారక ఉపన్యాసం ఇవ్వనున్నట్లు సమాచారం.

రైతులు, బీసీలు, సామాన్యుల కోసం కార్యక్రమాలు తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సాధారణ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అవార్డు జ్యూరీ పరిగణనలోకి తీసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధత వంటి అంశాలను కూడా ఎంపికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల వివిధ వేదికలపై చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. రైతులు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

ఇటీవల వైఎస్సార్ అవార్డుల కార్యక్రమానికీ హాజరు

మరోవైపు సెప్టెంబర్ 2న న్యూఢిల్లీలో నిర్వహించిన డా. వైఎస్సార్ అవార్డు-2026 కార్యక్రమానికి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. డా. వైఎస్సార్, డా. కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో కృషి చేస్తున్న ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

తాజాగా కేరళకు చెందిన ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ నుంచి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' పురస్కారానికి ఎంపిక కావడం ద్వారా రేవంత్‌రెడ్డి పేరు మరోసారి జాతీయ స్థాయిలో చర్చకు వచ్చింది. శుక్రవారం నిలంబూరులో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.



# మక్కా అంటే ఏమిటి? కాబా అంటే ఏమిటి?



**ప్రపంచ ముస్లింల ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిన మక్కా నగర చరిత్ర**

( సెప్టెంబర్-24 హంస కలంవార్త ) హంస కలంవార్త ఎడిటర్

మక్కా: ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే నగరం మక్కా. ఇది ప్రస్తుతం సౌదీ అరేబియా దేశంలో ఉంది. ముస్లింలు "మక్కా వెళ్తున్నాం" అని చెప్పినప్పుడు కేవలం ఒక మసీదుకు వెళ్లడం అనే అర్థం కాదు. మక్కా ఒక పురాతన నగరం. ఆ నగరంలోని అత్యంత పవిత్ర ప్రదేశంలో మస్జిద్ అల్‌హరామ్ అనే విశాలమైన పవిత్ర మసీదు ఉంది. ఆ మసీదు మధ్యలో ఉన్న నల్లని చతురస్రాకార పవిత్ర నిర్మాణమే కాబా. ముస్లింలు నమాజ్ చేసేటప్పుడు ప్రపంచంలోని ఏ ప్రాంతంలో ఉన్నా కాబా ఉన్న దిశ వైపు తిరిగి ప్రార్థిస్తారు.

**మక్కా మసీదా? నగరమా?**

మక్కా ఒక నగరం. మక్కా నగరంలోని ప్రధాన పవిత్ర స్థలం మస్జిద్ అల్‌హరామ్, అంటే పవిత్ర మసీదు. ఆ మసీదు మధ్యలో కాబా ఉంటుంది. అందువల్ల మక్కా, మసీదు, కాబా అనే మూడు పేర్లను ఒకటిగానే భావించడం సరైంది కాదు.

మక్కా -- నగరం

మస్జిద్ అల్‌హరామ్ -- పవిత్ర మసీదు

కాబా -- మసీదు మధ్యలో ఉన్న పవిత్ర గృహాకార నిర్మాణం

ఇదే మక్కా గురించి మొదట తెలుసుకోవాల్సిన



ముఖ్యమైన విషయం.

**కాబా చరిత్ర ఏమిటి?**

ఇస్లామీయ సంప్రదాయం ప్రకారం ప్రవక్త ఇబ్రాహీం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ కలిసి కాబాను నిర్మించారు. ఇబ్రాహీం కుటుంబం మక్కా లోయలో నివసించిన సందర్భంతో కాబా చరిత్ర ముడిపడి ఉంది. సౌదీ అరేబియా అధికారిక పవిత్ర స్థలాల సమాచారంలో కూడా కాబా నిర్మాణాన్ని ఇబ్రాహీం, ఇస్మాయిల్‌లతో అనుసంధానిస్తూ వివరించారు.

ఇస్లామీయ విశ్వాసం ప్రకారం అప్పట్లో మక్కా ప్రాంతం నీరు, పంటలు లేని ఎడారి లోయగా ఉండేది. ఇబ్రాహీం తన భార్య హాజర్, కుమారుడు ఇస్మాయిల్‌ను అక్కడ ఉంచిన తర్వాత జమ్‌జమ్ బావి ఉద్భవించిందని ముస్లిం సంప్రదాయం చెబుతుంది. ఆ తరువాత ఈ ప్రాంతం ప్రజలు చేరే పవిత్ర స్థలంగా అభివృద్ధి చెందిందని ఆ సంప్రదాయం వివరిస్తుంది.

**కాబా ఎందుకు అంత పవిత్రమైనది?**

ముస్లింల విశ్వాసంలో కాబా ఏకదైవారాధనకు ప్రతీక. ప్రపంచంలోని కోట్లాది మంది ముస్లింలు ప్రతిరోజూ నమాజ్ సమయంలో కాబా ఉన్న మక్కా దిశ వైపు తిరిగి ప్రార్థిస్తారు. ఈ దిశను కిబ్లా అంటారు.కాబా చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేయడాన్ని తవాఫ్ అంటారు. హజ్ లేదా ఉమ్రా కోసం మక్కాకు వెళ్లే ముస్లింలు మస్జిద్ అల్‌హరామ్‌లోని కాబా చుట్టూ తవాఫ్ చేస్తారు.

**నల్లటి రాయి అంటే ఏమిటి?**

కాబా ఒక మూలలో హజర్ అల్‌అస్వద్, అంటే నల్లరాయి ఉంది. ఇస్లామీయ సంప్రదాయంలో దీనికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. తవాఫ్ సమయంలో అవకాశం ఉన్నప్పుడు దానిని తాకడం లేదా ముద్దుపెట్టుకోవడం ప్రవక్త మహమ్మద్ ఆచరణకు



అనుసరణగా భావిస్తారు.

**కాబా లోపల ఏముంది?**

కాబా బయట నుంచి చూస్తే నల్లటి వస్త్రంతో కప్పబడిన చతురస్రాకార నిర్మాణంలా కనిపిస్తుంది. ఈ నల్లటి వస్త్రాన్ని కిస్వా అంటారు. అధికారిక వివరాల ప్రకారం కాబా లోపల పైకప్పుకు చెక్క స్తంభాలు, పాలరాతి నేల, గోడలపై అలంకరణలు ఉన్నాయి. కాబా తలుపు, నల్లరాయి, యెమెనీ మూల, హిజ్ర్, మిజాబ్ వంటి నిర్మాణ భాగాలు దాని చారిత్రక ప్రత్యేకతల్లో ఉన్నాయి.

**హిజ్ర్ ఇస్మాయిల్ అంటే ఏమిటి?**

కాబా పక్కన అర్ధచంద్రాకారంగా కనిపించే గోడల మధ్య ప్రాంతాన్ని హిజ్ర్ ఇస్మాయిల్ లేదా హతీమ్ అంటారు. సౌదీ ప్రెస్ ఏజెన్సీ 2026లో ప్రచురించిన చారిత్రక వివరణ ప్రకారం, ఇబ్రాహీం--ఇస్మాయిల్ నిర్మించిన అసలు కాబా పునాదుల్లో ఈ ప్రాంతం కూడా భాగంగా ఉన్నట్లు చారిత్రక సంప్రదాయాలు చెబుతున్నాయి. తరువాత ఖురైష్‌లు కాబాను పునర్నిర్మించినప్పుడు ఆ భాగాన్ని నిర్మాణంలో చేర్చలేదని ఆ వివరాలు చెబుతున్నాయి.

**మక్కాకు మహమ్మద్ ప్రవక్తకు ఉన్న సంబంధం**

ఇస్లామీయ చరిత్ర ప్రకారం ప్రవక్త మహమ్మద్ మక్కాలో జన్మించారు. ఆయన కాలానికి ముందు కూడా కాబా అరేబియాలో ప్రముఖ పవిత్ర కేంద్రంగా ఉండేది. అయితే అప్పటి మక్కాలో కాబా చుట్టూ విగ్రహారాధన ప్రబలంగా ఉండేది అని ఇస్లామీయ చారిత్రక మూలాలు వివరిస్తాయి.మహమ్మద్ ప్రవక్త మక్కాలో తన బోధనలు ప్రారంభించారు. తరువాత మదీనాకు వలస వెళ్లారు.



చివరకు మక్కా ఆయన ఆధీనంలోకి వచ్చిన తరువాత



కాబాలోని విగ్రహాలను తొలగించి, కాబాను ఏకదైవారాధనకు కేంద్రంగా పునరుద్ధరించినట్లు ఇస్లామీయ చరిత్ర చెబుతుంది.

**కాబా ఒక్కసారి మాత్రమే నిర్మించబడిందా?**

అలా కాదు. శతాబ్దాల కాలంలో కాబా అనేకసార్లు



మరమ్మతులు, పునర్నిర్మాణాలు పొందింది. ఖురైష్‌లు మహమ్మద్ ప్రవక్తకు ముందే కాబాను పునర్నిర్మించారు. తరువాత అబ్దుల్లా ఇబ్న్ అల్‌జుబైర్ కాలంలో కూడా పునర్నిర్మాణం జరిగింది. వివిధ కాలాల్లో వరదలు, నిర్మాణ నష్టం తదితర కారణాలతో మరమ్మతులు జరిగాయి. ఆధునిక కాలంలో కూడా కాబా భద్రత కోసం పునరుద్ధరణ పనులు చేపట్టబడ్డాయి.

**మక్కాకు ముస్లింలు ఎందుకు వెళ్తారు?**

ముస్లింలకు జీవితంలో కనీసం ఒక్కసారైనా హజ్ యాత్ర చేయడం, ఆరోగ్యం మరియు ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే, ఇస్లాం యొక్క ముఖ్యమైన ఆచారాల్లో ఒకటిగా భావిస్తారు. హజ్ సమయంలో మక్కాలోని కాబా, మస్జిద్ అల్‌హరామ్‌తో పాటు మినా, అరఫాత్, ముజ్దలిఫా వంటి పవిత్ర ప్రాంతాల్లో వివిధ ఆచారాలు నిర్వహిస్తారు.అదేవిధంగా ఉమ్రా అనే యాత్రను కూడా ముస్లింలు మక్కాకు వెళ్లి నిర్వహిస్తారు. అందుకే "మక్కాకు వెళ్తున్నాం" అనే మాట ముస్లింలలో సాధారణంగా పవిత్ర యాత్రకు సంబంధించినదిగా ఉంటుంది.

**మక్కా ఎక్కడ ఉంది?**

మక్కా సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలో, పర్వతాలతో చుట్టుముట్టిన లోయలో ఉంది. సౌదీ అధికారిక సమాచార ప్రకారం మస్జిద్ అల్‌హరామ్ మక్కా లోయ మధ్య ప్రాంతంలో ఉంది. ఈ భౌగోళిక ప్రాంతం పురాతన కాలం నుంచే కాబా చరిత్రతో అనుసంధానమై ఉంది.

మక్కా -- మతపరమైన విశ్వాసం, చారిత్రక ప్రదేశం రెండూ




మక్కా గురించి మాట్లాడేటప్పుడు మత విశ్వాసాలు, చారిత్రక ఆధారాలు రెండింటినీ వేరు చేసి చూడటం అవసరం. ఇబ్రాహీం, ఇస్మాయిల్, హాజర్, జమ్‌జమ్ వంటి అంశాలపై ఇస్లామీయ సంప్రదాయాలు విస్తృతంగా ఉన్నాయి. వాటిని ముస్లింలు పవిత్ర విశ్వాసాలుగా స్వీకరిస్తారు. అదే సమయంలో కాబా పునర్నిర్మాణాలు, ఖురైష్ కాలం, మహమ్మద్ ప్రవక్త కాలం, తరువాతి పాలకుల కాలంలో జరిగిన నిర్మాణ మార్పుల గురించి చారిత్రక



ఆధారాలు కూడా ఉన్నాయి.

**ముగింపు**

మక్కా ఒక నగరం.. మస్జిద్ అల్‌హరామ్ ఒక పవిత్ర మసీదు.. ఆ మసీదు మధ్యలో ఉన్న పవిత్ర నిర్మాణమే కాబా. ప్రపంచంలోని ముస్లింలు ప్రార్థన సమయంలో కాబా ఉన్న మక్కా దిశను కిబ్లాగా భావిస్తారు. హజ్, ఉమ్రా యాత్రలకు మక్కా ప్రధాన కేంద్రం. ఇబ్రాహీం, ఇస్మాయిల్‌లతో ముడిపడిన కాబా చరిత్ర, మహమ్మద్ ప్రవక్త కాలం, ఆ తరువాత జరిగిన పునర్నిర్మాణాలు, నేటి విస్తారమైన మస్జిద్ అల్‌హరామ్---ఇవన్నీ కలసి మక్కాను ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన ఆధ్యాత్మిక, చారిత్రక నగరాల్లో ఒకటిగా నిలబెట్టాయి.

హంస కలం వార్త

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

**బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి**

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య**

(సెప్టెంబర్-24 హంస కలంవార్త)

సంగారెడ్డి: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, వేధింపులకు సంబంధించిన అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య జిల్లా అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగేలా పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి పోలీసు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో బక్కి వెంకయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, ఉద్యోగాల్లో రోస్టర్ విధానం అమలు, భర్తీ కాని ఖాళీలు, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై శాఖల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సిద్దిపేటలో సంచార న్యాయస్థానం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది సత్యనారాయణకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వారి కోటా మేరకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆయా వర్గాల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలకు అధికారులు, ప్రజలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

ఉప ప్రణాళిక నిధులు ఇతర అవసరాలకు మళ్లించరాదు

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని చైర్మన్ స్పష్టం చేశారు. ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించరాదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమలులో అధికారులు జాప్యం లేదా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు యూనిఫారాలు, పుస్తకాలు, మౌలిక వసతులు, విద్యా సహాయ నిధులు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలను సమీక్షించారు. వసతి గృహాల మరమ్మతుల పరిస్థితిని కూడా అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న రైతు భరోసా, రైతు బీమా తదితర పథకాల అమలుపై ఆరా తీశారు. పారిశుద్ధ్య కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి కూడా అధికారులను వివరాలు కోరారు.

భర్తీ కాని ఖాళీలను త్వరగా భర్తీ చేయాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, భర్తీ కాని ఖాళీల వివరాలను శాఖల వారీగా చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. భర్తీ కాని ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో శాశ్వత అంగన్‌వాడీ భవనాలు లేని కేంద్రాలకు అవసరమైన స్థలాలను గుర్తించి, భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు.

బాధితులకు రూ.1.70 కోట్ల పరిహారం

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ భూసేకరణలో అసైన్డ్ భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా పరిధిలో పరిష్కరించగలిగిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సూచనలు, సలహాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అట్రాసిటీ కేసులకు సంబంధించి 2026 జనవరి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు 109 మంది బాధితులకు రూ.1.70 కోట్ల పరిహారం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో 88 మంది ఎస్సీలు, 21 మంది ఎస్టీలు ఉన్నారని వివరించారు. మరో 119 పెండింగ్ అట్రాసిటీ కేసులకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు రూ.1.82 కోట్ల నిధులు అవసరమని, ఆ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

నిర్ణీత సమయంలో కేసుల దర్యాప్తు

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా న్యాయస్థానాల్లో అభియోగపత్రాలు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య దృష్టికి తీసుకువచ్చారు. వారి నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించిన చైర్మన్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్, రాంబాబు నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గబ్బిలాల పేట ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనం



**స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి**

(సెప్టెంబర్-24 హంస కలంవార్త)

కాప్రా: గబ్బిలాల పేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర పాఠశాల భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. కాప్రా మండలంలోని గబ్బిలాల పేటలో ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఆధార్ సంఖ్య లేని విద్యార్థులకు ప్రత్యేక శిబిరం నిర్వహించి ఆధార్ సౌకర్యం కల్పించాలని కాప్రా మండల తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన ధ్రువపత్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గబ్బిలాల పేటలో సమగ్ర పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఇందుకు సంబంధించి అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలను కాప్రా మండల తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గబ్బిలాల పేటలోని 285, 299, 300, 185 సర్వే నంబర్లలో అందుబాటులో ఉన్న స్థలాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సర్వే నంబర్లకు సంబంధించిన భూ వివరాలను సమగ్రంగా పరిశీలించాలని, ఆయా స్థలాలపై ఏమైనా భూ వివాదాలు, న్యాయస్థాన కేసులు లేదా ఇతర సమస్యలు ఉన్నాయా అనే వివరాలను సేకరించి నివేదిక అందించాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని అన్ని అంశాలను పరిశీలించిన





పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల చదువు, వారికి అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి

అనంతరం నిర్ణయించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గబ్బిలాల పేటలోని 300 లేదా 185 సర్వే నంబర్లలో పాఠశాల భవనం నిర్మిస్తే గ్రామంలోని విద్యార్థులు, ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, స్థానికుల సూచనలను పరిగణనలోకి తీసుకుని స్థలాన్ని పరిశీలిస్తామని తెలిపారు. సమగ్ర పాఠశాల భవన నిర్మాణానికి విద్యాశాఖ నుంచి ముందస్తు అనుమతి ఇప్పటికే లభించిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందేలా నూతన పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పాఠశాల భవన నిర్మాణానికి స్థల ఎంపికలో భూ వివాదాలు, న్యాయపరమైన సమస్యలు లేకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, కాప్రా మండల తహసీల్దార్ మతిన్, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు పోస్టర్ ఆవిష్కరణ





**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు కార్యక్రమాలు**

( సెప్టెంబర్-24 హంస కలంవార్త )

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం--2026 వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 24వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు .అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఆవిష్కరించారు. వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, సమాజంలో వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించడం, వారి పట్ల కుటుంబ సభ్యులు, సమాజం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వయోవృద్ధులు సమాజానికి అందించిన సేవలు, వారి అనుభవం, విజ్ఞానం, జీవన విలువలను గుర్తిస్తూ వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని అవసరమైన సహాయాన్ని అందించే దిశగా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో వయోవృద్ధుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం, హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాలతో పాటు వారికి గౌరవం, ఆత్మవిశ్వాసం కల్పించే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సాంబశివరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు, మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని 13 ఏళ్ల బాలిక మృతి

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 24 (హంస కలంవార్త):**

ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న 13 ఏళ్ల బాలిక మృతి చెందిన విషాద ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుందిపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్నం మస్తా పవని ప్రపూర్ణ తన కుమార్తె నవ్యశ్రీతో కలిసి గురువారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై హెచ్ఏఎల్ నుంచి మీరా అకాడమీ వైపు వెళ్తున్నారు. వారు నర్సాపూర్ చౌరస్తా నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే మార్గంలో ఎస్ఎంఆర్ వినయ్ క్యాపిటల్ ఎదురుగా ఉన్న సాయి రాజ్ వాణిజ్య వంట పరికరాల సంస్థ సమీపానికి చేరుకున్నారు.అదే సమయంలో కుషాయిగూడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న 13 ఏళ్ల నవ్యశ్రీ రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో ఆర్టీసీ బస్సు ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది.ప్రమాదాన్ని గమనించిన సమీపంలోని వారు వెంటనే బాలికను చికిత్స నిమిత్తం బీబీఆర్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యుడు బాలికను పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలు నవ్యశ్రీ 8వ తరగతి చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం తదితర అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.











# గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో సైబరాబాద్ సీపీ పర్యవేక్షణ



నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి: సీపీ డా. ఎం. రమేష్

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (హంస కలం వార్త):**

గణేష్ విగ్రహాల నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా సైబరాబాద్ పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వాహనాల రాకపోకలు, రక్షణ చర్యలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ గురువారం స్వయంగా పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.నార్సింగి పరిధిలోని నెట్లంపూర్ చెరువు, కోకాపేట చెరువు, అమీన్పూర్ పరిధిలోని రాయసముద్రం చెరువు, సాకి చెరువు, పటాన్‌చెరు, చందానగర్ పరిధిలోని గంగారం చెరువుతో పాటు నార్సింగి, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాలను సీపీ సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి



సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.నిమజ్జన విగ్రహాలను తీసుకువచ్చే మార్గాల్లో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. భక్తులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా అవసరమైన ప్రాంతాల్లో వాహనాల మళ్లింపులు చేపట్టాలని సూచించారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు.నిమజ్జన ప్రాంతాల్లో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైన చోట అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటిలోకి ఎవరూ ప్రమాదకరంగా వెళ్లకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.పోలీసు శాఖతో పాటు విద్యుత్, రెవెన్యూ, వైద్య, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీపీ స్పష్టం చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, వెలుతురు, తాగునీరు, వైద్య సహాయం, పారిశుధ్యం తదితర సౌకర్యాలు సక్రమంగా ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.నిమజ్జన కార్యక్రమాలను ఆసరాగా చేసుకుని ఆకతాయితనానికి పాల్పడే వ్యక్తులు, దొంగతనాలకు పాల్పడే ముఠాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీపీ అధికారులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను నిశితంగా గమనించాలని, ప్రజల రద్దీని ఉపయోగించుకుని నేరాలకు పాల్పడే వారిని గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నిమజ్జన ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఎలాంటి ఇబ్బందులకు



గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. తప్పిపోయిన చిన్నారులు లేదా వ్యక్తుల విషయంలో వెంటనే స్పందించేలా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ, నిమజ్జన సమయంలో భద్రతా సూచనలు పాటించాలని కోరారు.నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని సీపీ డా. ఎం. రమేష్ ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.




# ప్రైవేట్ ప్రయాణికుల బస్సులో భారీ అగ్నిప్రమాదం

**డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం.. ప్రయాణికులంతా సురక్షితం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (హంస కలంవార్త):**

నగరంలోని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రైవేట్ ప్రయాణికుల బస్సులో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శ్రీశైలం దర్శనానికి ప్రయాణికులను తీసుకెళ్తున్న బస్సులో అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం నెలకొంది. అయితే బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రయాణికులను సకాలంలో కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాయత్రినగర్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రాత్రి సుమారు 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. శ్రీశైలం దర్శనానికి వెళ్తున్న ప్రయాణికులతో బస్సు వెళ్తుండగా, అకస్మాత్తుగా బస్సు ఇంజిన్ భాగం నుంచి మంటలు చెలరేగినట్లు సమాచారం.మంటలను గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమయ్యాడు. బస్సును నిలిపివేసి ప్రయాణికులను ఒక్కొక్కరినీ త్వరగా కిందకు దించాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడగలిగారు. కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తం వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది.ప్రమాదం జరిగిన ప్రాంతంలో మంటలు భారీగా ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సకాలంలో స్పందించడంతో మంటలు మరింత విస్తరించకుండా నివారించారు.ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయినప్పటికీ ప్రయాణికులెవరూ గాయపడలేదని సమాచారం. డ్రైవర్ అప్రమత్తతతో వ్యవహరించడంతోనే ప్రయాణికుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు పేర్కొన్నారు.ప్రమాదానికి గల అసలు కారణాలు ఏమిటన్న దానిపై మీర్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బస్సులో మంటలు ఇంజిన్ భాగం నుంచే ఎలా చెలరేగాయి, యాంత్రిక లోపం కారణమా లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే విషయాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# మైనర్ బాలికను రక్షించిన శశికుమార్‌కు సీపీ డాక్టర్ ఎం. రమేశ్ సన్మానం

**సమయస్ఫూర్తితో స్పందించి చిన్నారిని కాపాడిన శశికుమార్‌ను అభినందించిన సీపీ**

**(సెప్టెంబర్-24 హంస కలంవార్త)**

సైబరాబాద్: ప్రమాదంలో చిక్కుకున్న రెండేళ్ల చిన్నారిని ధైర్యసాహసాలతో రక్షించి, నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన శశికుమార్‌ను సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేశ్ అభినందించి ఘనంగా సన్మానించారు. ఆపదలో ఉన్న చిన్నారిని కాపాడేందుకు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమయస్ఫూర్తితో స్పందించిన శశికుమార్‌ను సీపీ ప్రత్యేకంగా ప్రశంసించారు.ఆగస్టు 16న ఓ రెండేళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిని శశికుమార్ అడ్డుకున్నారు. మార్గంలో వెళ్తున్న సమయంలో చిన్నారి ఆర్తనాదాలు వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన ఆయన, శబ్దం వచ్చిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ బాలిక ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న విషయాన్ని గుర్తించి, ఏమాత్రం వెనుకాడకుండా నిందితుడిని అడ్డుకుని చిన్నారిని అతడి చెర నుంచి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.అనంతరం నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో శశికుమార్ ప్రదర్శించిన ధైర్యం, సమయస్ఫూర్తి, మానవత్వాన్ని పోలీసులు అభినందించారు. ఒకవైపు చిన్నారిని ప్రమాదం నుంచి కాపాడటంతో పాటు, మరోవైపు నిందితుడు తప్పించుకోకుండా పట్టుకుని పోలీసులకు అప్పగించడం ద్వారా శశికుమార్ తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేశ్ శశికుమార్‌ను గంగారం చెరువు వద్దకు పిలిపించి శాలువాతో సత్కరించి అభినందించారు. ఆపదలో ఉన్న చిన్నారి పట్ల స్పందించిన తీరు అభినందనీయమని సీపీ పేర్కొన్నారు. సమాజంలో ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ముఖ్యంగా చిన్నారులు, మహిళల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని సీపీ తెలిపారు. శశికుమార్ చూపిన ధైర్యం, మానవత్వం, సమయస్ఫూర్తి సమాజంలోని ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు.చిన్నారి ప్రాణాలను, భద్రతను కాపాడేందుకు ముందుకొచ్చిన శశికుమార్‌ను సన్మానించడం ద్వారా సమాజంలో మంచి పనులు చేసే పౌరులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని సైబరాబాద్ పోలీసులు చాటిచెప్పారు.



# గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం దుకాణాలు బంద్

**ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరిగేలా అధికారుల చర్యలు**

**గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం దుకాణాలు బంద్**

**సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26న ఉదయం 6 గంటల వరకు మూసివేత**




**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (హంస కలంవార్త):**



గణేష్ విగ్రహాల తుది నిమజ్జన కార్యక్రమాలను పురస్కరించుకుని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. నిమజ్జన శోభాయాత్రలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న మద్యం విక్రయ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలని పోలీసు శాఖ ఆదేశించింది. ఈ ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేయనున్నారు. అయితే నక్షత్ర హోటళ్లలోని మద్యం సేవించే కేంద్రాలు, నమోదిత క్లబ్బులకు ఈ ఆదేశాల నుంచి మినహాయింపు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రలు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజల సమక్షంలో జరిగే అవకాశం ఉండటంతో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. నిమజ్జన మార్గాల్లో రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ, భక్తుల భద్రత, అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నారు. మద్యం విక్రయాలు నిలిపివేయడం ద్వారా నిమజ్జన కార్యక్రమాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత దుకాణాల నిర్వాహకులు పోలీసు శాఖ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న మద్యం విక్రయ కేంద్రాలు నిర్ణీత సమయం వరకు తెరవకూడదని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. గణేష్ నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, నిమజ్జన మార్గాల్లో పోలీసుల సూచనలు పాటించాలని అధికారులు కోరారు.






# టీజీఎస్ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా



**పదేళ్ల విరామం తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికలు.. డిపోలు, కార్మిక వర్గాల్లో సందడి**

**అక్టోబర్ 9న పోలింగ్.. 17న ఫలితాల వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (హంస కలం వార్త):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎట్టకేలకు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. సుదీర్ఘ విరామం అనంతరం ఎన్నికలు జరుగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోలు, కార్మిక వర్గాల్లో ఎన్నికల సందడి నెలకొంది. కార్మిక శాఖ ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 21 నుంచి



ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అక్టోబర్ 9న రహస్య బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించనుండగా, అక్టోబర్ 17న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఆర్టీసీలో చివరిసారిగా 2016 జూలై 19న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఎన్నికలు జరగకపోవడంతో కార్మిక సంఘాలు, ఉద్యోగులు సుదీర్ఘకాలంగా గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో డిపోల వారీగా కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

సెప్టెంబర్ 21 నుంచి ప్రక్రియ ప్రారంభం

ఎన్నికల ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 21న పోటీలో పాల్గొనే కార్మిక సంఘాల నుంచి అంగీకార పత్రాలను స్వీకరించారు. సెప్టెంబర్ 22న ముసాయిదా ఓటర్ల జాబితాను అందజేసి అభ్యంతరాలను స్వీకరించారు. సెప్టెంబర్ 24 వరకు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. సెప్టెంబర్ 25న తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు. సెప్టెంబర్ 26న పోటీలో పాల్గొనే సంఘాలకు ఎన్నికల గుర్తులను కేటాయించడంతో పాటు తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారికి అందజేయనున్నారు. సెప్టెంబర్ 29న సంఘాలకు నమూనా బ్యాలెట్ పత్రాలను అందజేయనున్నారు.

అక్టోబర్ 9న పోలింగ్

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ అక్టోబర్ 9న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. విధి నిర్వహణ కారణంగా సాధారణ పోలింగ్‌కు హాజరుకాలేని అర్హులైన ఉద్యోగుల కోసం అక్టోబర్ 14, 15 తేదీల్లో తపాలా ఓటు విధానాన్ని కూడా నిర్వహించనున్నారు. అనంతరం అక్టోబర్ 17న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు




కార్మిక సమస్యలపై కీలక ప్రాతినిధ్యం

ఆర్టీసీలో గుర్తింపు పొందిన కార్మిక సంఘానికి ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి అధికారికంగా చర్చించే అవకాశం ఉంటుంది. వేతనాలు, కరువు భత్యం, బోనస్, సేవా నిబంధనలు, ఉద్యోగ భద్రత, ఇతర ఉద్యోగ సంబంధిత అంశాలపై కార్మికుల తరఫున యాజమాన్యంతో చర్చించడంలో గుర్తింపు సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల ఈ ఎన్నికలు కేవలం సంఘం ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియగానే కాకుండా, భవిష్యత్తులో కార్మిక సమస్యలపై చర్చలు, పరిష్కారాలకు సంబంధించిన ముఖ్యమైన ప్రక్రియగా మారాయి.

రాష్ట్ర, ప్రాంతీయ స్థాయిల్లో ఓటింగ్

ఎన్నికల్లో రాష్ట్ర స్థాయి, ప్రాంతీయ స్థాయిల్లో గుర్తింపు సంఘాల కోసం వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్ నిర్వహించనున్నట్లు సమాచారం. అర్హత కలిగిన కార్మికులు, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 11 కార్మిక సంఘాలు పోటీకి అర్హత సాధించినట్లు సంబంధిత వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి.

డిపోల్లో పెరిగిన ఎన్నికల సందడి

ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో రాష్ట్రంలోని వివిధ ఆర్టీసీ డిపోల్లో కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు సమావేశాలు నిర్వహిస్తూ తమ సంఘాల విధానాలు, కార్మికుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికలు జరుగుతుండటంతో కార్మికుల్లో కూడా ఈ ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. గుర్తింపు పొందే సంఘం రానున్న కాలంలో కార్మికుల తరఫున యాజమాన్యంతో జరిపే చర్చల్లో ప్రాతినిధ్యం వహించనుంది. దీంతో వేతనాలు, భత్యాలు, బోనస్‌లు, సేవా నిబంధనలు, ఉద్యోగ భద్రత, సంక్షేమం తదితర అంశాలు ఎన్నికల సందర్భంగా ప్రధాన చర్చనీయాంశాలుగా మారుతున్నాయి.

# తీరం దాటిన తీవ్ర వాయుగుండం.. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు అవకాశం

**శ్రీకాకుళం, ( సెప్టెంబర్-24 హంస కలంవార్త )**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గురువారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కళింగపట్నానికి నైరుతి దిశగా తీరం దాటింది. తీరం దాటిన అనంతరం కూడా తీవ్ర వాయుగుండం ప్రభావం కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇది భూభాగంపై కొనసాగుతుండటంతో తెలుగు రాష్ట్రాల్లో రాబోయే 48 గంటలపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర తీర ప్రాంత జిల్లాలతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లకపోవడం మంచిదని అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, చెరువులు, వాగులు, కాలువల వైపు వెళ్లవద్దని సూచించారు. వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలిచే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని కోరారు. తీవ్ర గాలులు వీచే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, బలహీనమైన నిర్మాణాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. రైతులు కూడా పంటలు, వ్యవసాయ పనుల విషయంలో స్థానిక అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. వాయుగుండం కదలిక, వర్షాల తీవ్రతను వాతావరణ శాఖ నిరంతరం పరిశీలిస్తోంది. పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు, సూచనలు జారీ చేస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించి, వదంతులను నమ్మవద్దని సూచించారు.



# గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు




**నగరవ్యాప్తంగా 24 గంటల పాటు 700 ప్రత్యేక బస్సుల నిర్వహణ**

**(సెప్టెంబర్-24 హంస కలంవార్త)**

హైదరాబాద్: భాగ్యనగరంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీజీఎస్ ఆర్టీసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాకపోకలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించారు. నగరంలో ఏర్పడే రద్దీ, ట్రాఫిక్ మళ్లింపులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు నిరంతరాయంగా రవాణా సౌకర్యం అందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాలకు వచ్చే భక్తులు, నిమజ్జనం అనంతరం తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం 24 గంటల పాటు సుమారు 700 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల నుంచి నగరంలోని వివిధ మార్గాలకు ప్రయాణికులను తరలించేలా ప్రత్యేక రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నారు.

**44 కీలక ప్రాంతాల్లో అధికారులు**

నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల రాకపోకలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 44 కీలక ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులు, నియంత్రణ సిబ్బందిని నియమించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ బస్సుల రాకపోకలను క్రమబద్ధీకరించనున్నారు. ట్రాఫిక్ పరిస్థితులకు అనుగుణంగా బస్సుల మార్గాల్లో అవసరమైన మార్పులు చేపట్టనున్నారు. ప్రయాణికుల రద్దీని నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్టీసీ ప్రాంతీయ కార్యాలయంలో ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన ప్రాంతాలకు అదనపు బస్సులను మళ్లించేలా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. అత్యవసర సహాయక వాహనాలుబస్సుల రాకపోకల్లో అనుకోని అంతరాయాలు ఏర్పడితే వెంటనే స్పందించేందుకు పాత శాసనసభ్యుల నివాస సముదాయం, ఇందిరాపార్కు, వీవీ విగ్రహం వద్ద ఆర్టీసీ అత్యవసర సహాయక వాహనాలను అందుబాటులో ఉంచారు. నిమజ్జన సమయంలో బస్సులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తినా వెంటనే మరమ్మతులు చేపట్టేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. అదేవిధంగా ఖైరతాబాద్, లక్డీకాపూల్, కోటి, బషీర్‌బాగ్, ఇందిరాపార్కు, ఆకాశవాణి కేంద్రం ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు బస్సుల రాకపోకలను పర్యవేక్షించనున్నారు. 113 మంది డ్రైవర్లు, 87 మంది మెకానిక్‌లు సిద్ధ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా బస్సులకు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. పోలీసు స్టేషన్ల పరిధిలో అత్యవసర సేవలు అందించేందుకు 113 మంది డ్రైవర్లు, 87 మంది మెకానిక్‌లను అందుబాటులో ఉంచారు. బస్సు మధ్యలో నిలిచిపోయిన సందర్భాల్లో వీరి సహాయంతో వెంటనే మరమ్మతులు చేపట్టి రవాణాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోనున్నారు.

**పోలీసుల సూచనలకు అనుగుణంగా బస్సుల మార్గాలు**







నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉండనున్న నేపథ్యంలో పోలీసు అధికారుల సూచనలకు అనుగుణంగా నగర బస్సులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సుల మార్గాల్లోనూ అవసరమైన మార్పులు చేయనున్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పరిస్థితులకు అనుగుణంగా బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడిపించనున్నారు. నిమజ్జన కార్యక్రమాలు శనివారం ఉదయం వరకు కొనసాగినా ప్రయాణికులకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యామ్నాయ ప్రణాళికలను సిద్ధం చేసింది. ప్రయాణికుల రద్దీ పెరిగే ప్రాంతాలను గుర్తించి అవసరమైన మేరకు అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులు, నిమజ్జనం అనంతరం తమ ఇళ్లకు తిరిగి వెళ్లే ప్రజలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయనున్నారు. పోలీసు శాఖతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు రవాణా వ్యవస్థను పర్యవేక్షించనున్నారు.

# నిమజ్జనం బందోబస్తులో విషాదం

**గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొని ఎస్ఐ మృతి**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (హంస కలం వార్త):

గణేశ్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌లో బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారిని గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటన విషాదానికి దారితీసింది. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన కొత్తగూడెం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కిన్నెర వెంకన్న (55) చికిత్స పొందుతూ మృతి చెందారు. కొత్తగూడెం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కిన్నెర వెంకన్న మంగళవారం గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్--2 వద్ద బందోబస్తు విధుల్లో ఉన్నారు. అదే సమయంలో గుర్తుతెలియని ద్విచక్రవాహనదారుడు వెంకన్నను ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో పెద్దగా గాయాలు కాలేదని భావించిన వెంకన్న స్వగ్రామానికి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నారు.




ప్రమాదం అనంతరం ఆయన స్వగ్రామానికి బయలుదేరి వరంగల్‌కు చేరుకున్నారు. అక్కడ ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో బుధవారం వెంకన్న మృతి చెందారు. నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉండగా జరిగిన ప్రమాదంలో ఎస్ఐ మృతి చెందడంతో పోలీసు వర్గాల్లో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని ద్విచక్రవాహనదారుడిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తూ, ప్రమాదానికి కారణమైన వ్యక్తిని గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు.





# వైఎస్ షర్మిల కుమార్తె నిశ్చితార్థ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కాబోయే వధూవరులకు ఆశీస్సులు అందించిన ముఖ్యమంత్రి దంపతులు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 24:**

ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కుమార్తె అంజిలి, రఘు వివాహ నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. కొత్వాల్‌గూడలో నిర్వహించిన ఈ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులు అంజిలి, రఘులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు ఆశీర్వదించి, వారి భవిష్యత్ వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వధూవరుల కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి నిశ్చితార్థ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. వధూవరుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రముఖులు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ నిశ్చితార్థ వేడుక సందడిగా సాగింది.

# తండ్రి పేరుతో వచ్చే ఒత్తిడిని పట్టించుకోను..

## నా ఆట నేను ఆడతా: సెహ్వాగ్ కుమారుడు

భారత క్రికెట్‌లో డాషింగ్ ఓపెనర్‌గా పేరొందిన వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఇప్పుడు మైదానంలోకి అడుగుపెట్టాడు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ ఆయన పెద్ద కుమారుడు 18 ఏళ్ల ఆర్యవీర్ సెహ్వాగ్ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఇటీవలే భారత అండర్-19 జట్టు తరఫున ఆస్ట్రేలియాతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో ఆర్యవీర్ అరంగేట్రం చేశాడు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడి 28, 47, 34 పరుగులు సాధించాడు. అంతకుముందు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లోనూ వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ సందర్భంగా ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన ఆర్యవీర్, తన ప్రదర్శనపై కొంత నిరాశ వ్యక్తం చేశాడు. "మూడు మ్యాచ్‌లలోనూ మంచి ఆరంభాలు లభించినా, వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయాను. చివరి గేమ్‌లో కూడా కుదురుకున్నాక సిక్స్ కొట్టే ప్రయత్నంలో ఔటయ్యాను. ఇది నన్ను నిరాశపరిచింది. క్రికెట్‌లో పేరు సంపాదించాలంటే భారీ పరుగులు చేయడం చాలా ముఖ్యం. ఇన్నింగ్స్‌ను దశలవారీగా విభజించుకుని ముందుకు సాగాలని నేర్చుకున్నాను" అని తెలిపాడు. ప్రఖ్యాత ఇంటిపేరుతో వచ్చే ఒత్తిడి గురించి మాట్లాడుతూ.. ఆర్యవీర్ ఎంతో పరిణతితో సమాధానమిచ్చాడు. "నా ఇంటిపేరు, మా నాన్న సాధించిన విజయాల గురించి నేను ఎంతో గర్వపడతాను. ఆయన పేరు వల్ల నాపై ఎలాంటి ఒత్తిడి, భారం లేదు. ప్రశంసలు, విమర్శలను పట్టించుకోకుండా నా ఆటపై, నా ప్రక్రియపై మాత్రమే దృష్టి పెట్టేలా మైండ్‌సెట్ క్రియేట్ చేసుకుంటున్నాను. అదే నాకు మంచిది" అని స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియాతో సిరీస్ అనుభవం తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఆర్యవీర్ చెప్పాడు. "అరంగేట్రం మ్యాచ్‌కు ముందు కొంచెం నర్వస్‌గా ఉన్నాను. ఆస్ట్రేలియా బౌలర్లు మంచి వేగంతో బౌలింగ్ చేశారు. వారిని ఎదుర్కోవడం ఎంతో ఆనందాన్నిచ్చింది" అని అన్నాడు. తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ ఇచ్చే సలహాల గురించి కూడా ఆర్యవీర్ పంచుకున్నాడు. "నాన్న నాకు ఎప్పుడూ బ్యాటింగ్‌ను చాలా సింపుల్‌గా ఉంచుకోమని చెబుతారు. 'కొట్టగల బంతిని కొట్టు, వదిలేయగలిగేదాన్ని వదిలేయ్, డిఫెండ్ చేయాల్సి వస్తే డిఫెండ్ చెయ్' అని సలహా ఇస్తారు. సోషల్ మీడియాలో చాలా మాటలు వినిపిస్తుంటాయి కాబట్టి, టెక్నిక్ కంటే మానసిక దృఢత్వంపై ఎక్కువ దృష్టి పెట్టమని చెబుతారు" అని వెల్లడించాడు. తాను విరాట్ కోహ్లీకి పెద్ద అభిమానినని, ఆయన్ను రెండు, మూడు సార్లు కలిశానని ఆర్యవీర్ తెలిపాడు





## జీవితాంతం నీవు నా దగ్గరే ఉంటావు: విజయ్ దేవరకొండ



**విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న 'రణబాలి'**

**విజయ్ పై ఏమాత్రం క్రష్ తగ్గలేదన్న రష్మిక**

**అంతే ప్రేమతో సమాధానమిచ్చిన విజయ్ దేవరకొండ**

రియల్ లైఫ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ 'సింగనమల బొబ్బిలి రణబాలి'గా పవర్‌ఫుల్ పాత్రలో అలరించనుండగా, ఆయనకు జోడీగా రష్మిక 'జయమ్మ' పాత్రలో నటిస్తోంది. ఇటీవల విడుదలైన 'ఏందయ్యా సామీ..' పాట యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా విశేష ప్రజాదరణ పొందుతోంది. తాజాగా, ఈ పాటలోని ఒక రొమాంటిక్ క్లిప్‌ను రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ... అతను పూర్తిగా తనకే సొంతమయ్యాడని, కానీ అతనిపై ఉన్న క్రష్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని కామెంట్ చేసింది. దీనికి విజయ్ దేవరకొండ రిప్లై ఇస్తూ... "నేను ఎంతో అదృష్టవంతుడిని. నేను జయమ్మని మిస్ అవుతాను కానీ.. జీవితాంతం నువ్వు నా దగ్గరే ఉంటావు" అని ఎంతో ప్రేమగా స్పందించాడు. ఈ సరదా సంభాషణ మరియు వారి మధ్య ఉన్న అనుబంధం చూసి అభిమానులు మురిసిపోతున్నారు. మరోవైపు, ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తుండగా... మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## నాకు ఇది పునర్జన్మ.. దయచేసి హెల్మెట్ పెట్టుకోండి: సాయి దుర్గ తేజ్ ఎమోషనల్ పోస్ట్!

టాలీవుడ్ నటుడు సాయి దుర్గ తేజ్ ఐదేళ్ల క్రితం తాను ఎదుర్కొన్న ఘోర రోడ్డు ప్రమాదాన్ని గుర్తుచేసుకుంటూ నేడు ఓ భావోద్వేగ ప్రకటన విడుదల చేశారు. ప్రమాదం జరిగిన రోజును తన 'పునర్జన్మ దినం'గా పేర్కొంటూ, హెల్మెట్ పెట్టుకోవడం అనే ఒక్క చిన్న నిర్ణయం వల్లే తాను ఈ రోజు బతికున్నానని తెలిపారు. అభిమానులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో 'పునర్జన్మ-దినం' పేరుతో ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. "నా కుటుంబానికి, స్నేహితులకు, అభిమానులకు, ప్రతి సినీ ప్రేమికుడికి.. సరిగ్గా ఐదేళ్ల క్రితం మీ ప్రార్థనలు, ప్రేమ, బేషరతు మద్దతుతో నాకు రెండో జీవితం లభించింది. గాయాల నుంచి నేను 90% కోలుకున్నాను. ఇంకా నా మాటలో, మరికొన్ని ఇతర సవాళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. కానీ వాటిని అధిగమిస్తున్నాను. ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నాను" అని పేర్కొన్నారు. "మీ ప్రేమ నన్ను ఎప్పుడూ వీడలేదు. ప్రతీ కష్టమైన రోజు, ఎదురైన ప్రతీ ఎదురుదెబ్బ, వదిలేయడం సులభం అనిపించిన ప్రతి క్షణంలోనూ నాకు అండగా నిలిచి బలాన్నిచ్చింది. ఐదేళ్ల తర్వాత ఇక్కడ ఉన్నాను. ఇంకా నిలబడి ఉన్నాను. పోరాడుతూనే ఉన్నాను. జీవిస్తూనే ఉన్నాను. మీ ప్రార్థనలకు, శుభాకాంక్షలకు, సందేశాలకు, మీరు చూపిన ప్రేమకు ధన్యవాదాలు. మీరు లేకుండా నేను ఇక్కడ ఉండేవాడిని కాదు" అని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన కథ నుంచి అభిమానులు ఒక ముఖ్యమైన విషయం నేర్చుకోవాలని ఆయన కోరారు. "దయచేసి హెల్మెట్ పెట్టుకోండి. ఆ ఒక్క చిన్న నిర్ణయమే నేను ఈ రోజు ఇక్కడ ఉండటానికి కారణం" అని తన ప్రకటనలో రాసుకొచ్చారు. సాయి దుర్గ తేజ్ 2021 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్పోర్ట్స్ బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి కిందపడటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ఇక, సినిమాల విషయానికొస్తే.. సాయి దుర్గ తేజ్ ప్రస్తుతం దర్శకుడు రోహిత్ కేపీ రూపొందిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'సంబరాల ఏటి గట్టు'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.






## శర్వానంద్ 'జార్జ్ క్రిష్' నుంచి కీలక అప్‌డేట్.. హీరోయిన్ ఎవరో తేలిపోయింది!

**'జార్జ్ క్రిష్'లో హీరోయిన్‌గా మానస వారణాసి**

**'కపుల్ ఫ్రెండ్లీ'తో మానసకు మంచి గుర్తింపు**

**సంగీతం అందించనున్న అనూప్ రూబెన్స్**

హీరో శర్వానంద్ కొత్త సినిమా 'జార్జ్ క్రిష్'పై మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మానస వారణాసిని ఎంపిక చేశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఇటీవల మంచి గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'జార్జ్ క్రిష్'లో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. శర్వానంద్ వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్నారు. 'నారి నారి నడుమ మురారి', 'బైకర్' సినిమాలు ఇటీవల ప్రేక్షకులను అలరించాయి. 'జార్జ్ క్రిష్'ను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు. శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ కూడా ఉంది. 'శతమానం భవతి', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'నారి నారి నడుమ మురారి' వంటి సినిమాలు సంక్రాంతి బరిలోకి వచ్చి విజయాలు అందుకున్నాయి. దీంతో 'జార్జ్ క్రిష్'పై అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవలే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ఛాన్ చేయగా.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లాప్ కొట్టారు. తొలి షాట్‌కు శ్రీను వైట్ల దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ కథ అందించారు.

Edited, Printed,Published and Owned by **V. Madhusudan chary** , Lake view krishna residency.Flat no 102.Road no 4 Jaya nagarNear Ganesh Mandapam Kukatpally Telangana 500072, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, **PRGI TGTEL/26/A3129** Cell.No 9966555449